పాఠశాలను తనిఖీ చేసిన డీడీ

ప్రజాశక్తి-అరకులోయ: మండలంలోని రవ్వలగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి సంచాలకులు ఎల్.రజని శుక్రవారం రాత్రి సందర్శించారు. విద్యార్థుల స్టడీ అవర్ను పరిశీలించారు. స్టడీ అవర్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని అన్నారు. విద్యార్థులకు అందించిన మెనూపై ఆరా తీశారు. ముందుగా నిర్దేశించిన ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన మెనూను అందించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు.

పరిశీలిస్తున్న డీడీ రజని

అదానీ ఒప్పందాలను రద్దు చేయాలని..

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-పాడేరు : అదానీ గ్రూప్తో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని పాడేరు జిల్లా కేంద్రంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. సిపిఎం కార్యాలయం నుండి ఆర్.టి.సి కాంప్లెక్స్ వరకు అవినీతి రాకాసి దిష్టిబొమ్మతో నిరసన ప్రదర్శన కొనసాగించారు. కాంప్లెక్స్ దగ్గర అవినీతి రాక్షసి దిష్టిబొమ్మ దగ్ధం చేసేందుకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు ప్రయత్నించగా పోలీస్లు అడ్డుకున్నారు.

అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పల నర్స మాట్లాడుతూ, విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకునేందుకు అదానీ గ్రూపు భారీ ముడుపులు చెల్లించిందని అమెరికా కోర్టులో వ్యాజ్యం నమోదు నేపథ్యంలో ఈ అంశంపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇతర నిందితుల అరెస్టుకు, ముడుపులు పొందిన వారి పేర్లు, వివరాలను అమెరికా ప్రభుత్వం నుండి తెప్పించడానికి దౌత్యపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గౌతమ్ అదానీ, మరో ఏడుగురు నిందితులు 'సెకి' నుండి ఆంధ్రప్రదేశ్ డిస్కాములు 7 గిగావాట్ల సౌర విద్యుత్కొనుగోలు ఒప్పందం

సిపిఎం నేత అప్పలనర్సను అడ్డగిస్తున్న పోలీసు

చేయడానికి 2019-24 మధ్య అధికారంలో వున్న వారికి 2029 వేల కోట్లు ముడుపులు చెల్లించినట్లు అమెరికాలోని తూర్పు న్యూయార్క్ జిల్లా కోర్టులో (సిఆర్ నెం. 24- సిఆర్ - 433, తేదీ 2024 అక్టోబర్ 24) కేసు నమోదైందన్నారు.సెకి నుండి విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర డిస్కాములు చేసుకున్న ఒప్పందం రాష్ట్రానికి నష్టదాయకమని తొలి నుండి సిపిఎం వ్యతిరేకించడం, దాన్ని రద్దు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. విద్యుత్ నియంత్రణ మండలి జరిపిన పబ్లిక్ హియరింగ్ లోనూ సి.పి ఎం ప్రతినిధులు ఆయా సందర్భాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతూనే ఉన్నారని గుర్తు చేశారు.. సదరు ఒప్పందాన్ని విద్యుత్ ఉద్యోగులు, సాధారణ ప్రజలు కూడా వ్యతిరేకించారని చెప్పారు.2019-20 మధ్య సెకి ఒప్పందమే గాక రాష్ట్రంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్లాంట్లు, విశాఖలో డేటా సెంటర్, గంగవరంపోర్టు వంటి వివిధ ప్రాజెక్టులను అదానీ గ్రూపు సంస్థలతో నాటి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుని ప్రభుత్వ ఆస్తులను, ప్రజల సంపదను వారికి

నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు

ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. సుమారు 73వేల కోట్ల రూపాయల భారాలు ప్రజలపై మోపడానికి పాలకులు కుట్ర చేశారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పెద్దబిడ్డ, చి,గుజ్జెలి, ఎర్రవరం, రైవడ తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదానికి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతిని నాటి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అదానీ గ్రూపు ఆర్థిక అక్రమాలకు పాల్పడుతోందని గతంలో హిండెన్బర్గ్ నివేదిక కుండబద్దలు కొట్టిందన్నారు.. అధికారంలోవున్న వారికి భారీగా ముడుపులు చెల్లించిందని ఇప్పుడు ఏకంగా కోర్టులో కేసు నమోదైందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..అదానీ గ్రూపుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేసుకోవాలని, వారికి కేటాయించిన భూముల్ని, ప్రజల సంపదను వెనక్కి తీసుకోవాలన్నారు.విశాఖ డేటా సెంటర్ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం నాయకులు ఎస్.ధర్మాన పడల్, జీవన, కార్తీక్, చిన్నారావు పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ

- 35 గోల్డ్ మెడల్స్ సొంతం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి 35 గోల్డ్ మెడల్స్ సాధించారు. ఇటీవల అల్లూరి జిల్లా అరకులో జరిగిన ఏకలవ్య పాఠశాలల రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో స్థానిక ఏకలవ్య పాఠశాల నుండి పాల్గొన్న విద్యార్థులు జూడో, వెయిట్ లిఫ్టింగ్, యోగా, వాలీబాల్ తదితర క్రీడల్లో విశేషంగా రాణించి 35 గోల్డ్ మెడల్స్, నాలుగు సిల్వర్, నాలుగు బ్రాంచ్ మెడలు కైవసం చేసుకున్నారని పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణారావు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు మెడల్స్ సాధించిన విద్యార్థులను, మంచి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.

గిరిజన రైతులను ప్రోత్సహిస్తాం

-ఐఐఎంఆర్ డైరెక్టర్ తార సత్యవతి - ఎఫ్పిఒ కేంద్రం ప్రారంభం

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తార సత్యవతి

ప్రజాశక్తి-చింతపల్లి: ఎఫ్పిఓల ద్వారా గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు ఐఐఎంఆర్ ఎల్లప్పుడు ముందుంటుందని ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సి తార సత్యవతి అన్నారు. ఐఐఎంఆర్, నాబార్డ్, బీసీటీ కెవికెల సహకారం, ప్రోత్సాహంతో లంబసింగి ట్రైబల్ ప్రొడక్ట్స్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ అకౌంటెంట్ రాజేష్ ఆధ్వర్యంలో నిర్మించిన లంబసింగి ఎఫ్పిఓ కలెక్షన్స్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్, అవుట్ లెట్స్, ఆర్వో వాటర్ ప్లాంట్ లను ఐఐఎంఆర్ శాస్త్రవేత్తలు శ్రీనివాస బాబు, డాక్టర్ సంగప్ప, ఏపీ ఎఫ్ పి ఎస్ సీఈవో డాక్టర్ గెడ్డం శేఖర్ రావుబాబు, జిల్లా ఉద్యాన అధికారి రమేష్ కుమార్, నాబార్డ్ డిడిఎం చక్రధర్, బీసీటీ కెవికె శాస్త్రవేత్త కుర్రా శైలజ, స్థానిక ఆర్ ఏ ఆర్ ఎస్ ఏ అప్పలస్వామిలతో కలిసి ఆమె లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఫ్పిఓ తయారు చేసిన పలు ఉత్పత్తులను ఆమె పరిశీలించారు. అనంతరం డాక్టర్ రఫీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె ఈ ప్రాంతంలో కలెక్షన్స్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్, వాటర్ ప్లాంట్, అవుట్లెట్స్ ఏర్పాటుకు అహర్నిశలు శ్రమించిన ఎఫ్పిఓ చైర్మన్ ఉల్లి నూకరాజు, డైరెక్టర్లు సరోజ (రూతు), ఇందిర, శోభారాణి, కన్నబాబు లతో పాటు ఎఫ్ పి ఓ అభివృద్ధికి ప్రోత్సహించిన పలువురిని ఈ సందర్భంగా ఆమె సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమిష్టి కృషితో ఏ పనినైనా సాధించవచ్చునన్నారు. ఐఐఎంఆర్, నాబార్డ్ లు గిరిజన రైతాంగాన్ని ప్రోత్సహించేందుకు ఎల్లవేళలా ముందుంటాయని తెలిపారు. వాటి సహకారంతో బీసీటీ కేవీకే, హెచ్ఎంఆర్ ప్రోత్సాహంతో రైతాంగం ఆర్థిక స్థితిని పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. మిగిలిన పంచాయతీలు, గ్రామాల్లోనూ రైతులకు అవగాహన కల్పించి ఎఫ్ పి ఓ బృందాలుగా తయారు చేసే బాధ్యతను తీసుకోవాలన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల వాడకంతో ఆరోగ్యాన్ని పొందడమే గాక ఆర్థికంగాను నిలదొక్కుకునే అవకాశాలు ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో గడచిన ఏడాది 200 ఎకరాలలో రాగులు, సామలు సాగు చేసిన రైతాంగం ఈ ఏడాది ఎనిమిది వందల ఎకరాలలో సాగు చేయడం శుభ సూచకమని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.

స్థానిక సర్పంచ్ సమిడి గోపాల్, ఎంపీటీసీ పొట్టిక లోవరాజులు మాట్లాడుతూ, తమ పంచాయతీ పరిధిలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. గిరిజన రైతాంగానికి ఉపయోగపడే వ్యవసాయ ఉత్పత్తుల కలెక్షన్స్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్, ఆర్వో వాటర్ ప్లాంట్ అందుబాటులోకి తీసుకురావడం హర్షనీయమన్నారు, అనంతరం శాస్త్రవేత్తలు శ్రీనివాస్ బాబు, రమేష్ కుమార్, సంగప్ప, నాబార్డ్ డీడీఎం చక్రధర్, ఆర్ఎఆర్ఎస్ ఏడిఆర్ అప్పలస్వామి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త బాల హుస్సేన్ రెడ్డి, ఉద్యాన శాస్త్రవేత్త చెట్టి బిందు, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త దివ్య సుధ, అంకంరెడ్డి చంద్రిక, హెచ్ఎంఆర్ బృందం, ఎఫ్పిఓ సభ్యులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

చింతపల్లి ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-చింతపల్లి : మోకాళ్ళ అరుగుదలతో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించడం జరిగిందని ఆసుపత్రి సూపరిండెంట్ ప్రభావతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ, మోకాళ్ళ నొప్పితో స్థానిక ఆసుపత్రికి వచ్చిన వ్యక్తికి ఎముకుల విభాగం వైద్యాధికారి ఈ. సాయి క్రిష్ణ మోకాళ్లు అరిగిపోయినట్లు గుర్తించి ప్లేట్లెట్స్ రిచ్ ప్లాస్మాని ఇచ్చి వైద్యం చేయడం జరిగిందన్నారు. ఇటువంటి వైద్యం మన ఏజెన్సీ ప్రాంతంలో ప్రధమముగా నిర్వహించడం జరిగిందన్నారు. ఇకపై కాళ్లు, మడమ, మోకాళ్ళ నొప్పులతో బాధపడేవారు స్థానిక ఆసుపత్రికి వచ్చి ఎముకల విభాగం వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో ఇటువంటి శస్త్ర చికిత్స 20 వేల నుంచి 30 వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని అటువంటి శస్త్ర చికిత్సను ఇక్కడ ఉచితంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శస్త్ర చికిత్సలో స్థానిక వైద్యాధికారి రమేష్, చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రోగితో వైద్యులు

సంతలో ప్రచారం చేస్తున్న ఎంపిటిసి, సర్పంచ్ తదతరులు

ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించాలి

ప్రజాశక్తి-సీలేరు

ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించాలని గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు, సర్పంచ్ బుజ్జిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సప్పర్ల వారపు సంతలో వ్యాపారులకు సర్క్యూలర్లు అందించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఓ అభిషేక్ ఆదేశాల మేరకు డిసెంబర్ ఒకటి నుంచి ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే సప్పర్ల సంతలో వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ గ్రామపంచాయతీ నుంచి సర్క్యూలర్ జారీ చేశామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నాయని, దానిపై విస్తృతంగా ప్రచారం చేసినట్లు తెలిపారు. డిసెంబర్ ఒకటి నుంచి వ్యాపారులు ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్, డిఎ ధనుంజయ్, వార్డ్ మెంబర్ శంకరు సుబ్బారావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వల్ల పర్యావరణం కలుషితం

సీలేరు : ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణం కలుషితం అవుతుందని, దాని వల్ల అనేక అనర్థాలకు దారితీస్తుందనిజీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్రావు అన్నారు. సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యాపకులు విద్యార్థులు కళాశాలలోని చెత్తా చెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి నిప్పు పెట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శంకర్రావు మాట్లాడుతూ వాటర్ బాటిళ్లు, మైకా కవర్లు, టీ గ్లాసులు, వాటర్ గ్లాసులు ప్రజలు అవసరాలకు వినియోగించుకొని విచ్చలవిడిగా ఎక్కడికక్కడ పడవేయడంతో పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

అపార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

విద్యార్థుల వివరాలను త్వరితగతిన సేకరించి, అపార్ ఐడీల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కొయ్యూరు ఎంపీడీవో ఎస్కేవీ ప్రసాద్ సూచించారు. స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయం, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. అపార్ ఐడీల నమోదు ప్రక్రియ గురించి కేజీబీవీ ప్రత్యేక అధికారిణి పరిమళ, హెచ్ఎం గోపాల్ను అడిగి తెలుసుకున్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి

ఇంటి నిర్మాణ సామగ్రి వితరణ

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని చూచి రేవుల గూడెం (భీమవరం)లో అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిబూడిదైన తెల్ల ముత్తయ్య కుటుంబానికి ఇంటి నిర్మాణ సామగ్రిని జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు తరుపున అందించారు. అగ్ని ప్రమాద విషయం టిడిపి నాయకులు, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్కు తెలియజేయగా, ఆయన వెంటనే తమ సిబ్బందిని పంపించి వారికి ఏమి కావాలో తెలుసుకొని అన్ని ఏర్పాటు చేశారు. జెకెసి ట్రస్టు ద్వారా ఆ కుటుంబానికి సుమారు రూ.30 వేలు విలువ చేసే సిమెంట్ రేకులు, ఇనుప గొట్టాలు శనివారం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోడియం అప్పారావు, తెలుగుదేశం పార్టీ మండల మాజీ అధ్యక్షులు గడిసుల ప్రేమచంద్, సీనియర్ నాయకులు అయినబోయిన నాగరాజు, బోడ వెంకటేశ్వర్లు, కారం సర్వేశ్వరరావు ట్రస్ట్ సభ్యులు సూఫీ పాల్గొన్నారు.

అగ్నికి కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న జమాల్ ఖాన్

24న లాభాపేక్ష రహిత సంస్థల ఫోరం ప్రారంభం

ప్రజాశక్తి పాడేరు: కలెక్టరేట్ కార్యలయం లో నమోద చేస్కున్న అన్ని స్వచ్ఛంద సంస్థలులకు, సి ఎస్ఆర్, లాభాపేక్షలేని సంస్థలకు 'జిల్లా లాభాపేక్ష రహిత సంస్థల ఫోరం ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తునట్టు శనివారం జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ ఒక ప్రకటన లో తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల29 న మద్యాహ్నం 4గంటలకు జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఫోరంను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ అధ్యక్షతన 'డిస్ట్రిక్ట్ నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ ఫోరమ్' ప్రారంభోత్సవం అనతరం స్వచ్ఛంద సంస్థలు, సి ఎస్ఆర్, లాభాపేక్షలేని సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ ఏఎస్ దినేష్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి కీలకోపన్యాసం చేస్తారన్నారు. పూర్తి వివరాలకు జి. నారాయణ రెడ్డి ని 8106797474 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని తెలియజేశారు.

3 నెలల పింఛను బకాయిల చెల్లింపు

- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు, : ఎన్టీఆర్ భరోసా కింద పింఛను మూడు నెలల బకాయిల చెల్లింపును నవంబర్ ఒకటవ తేదీ నుండి అమలులోకి వచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు దాఖలు చేసిందని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ లబ్దిదారులకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పెన్షన్ పంపిణీ వ్యవధిలో అందుబాటులో లేని, పెన్షన్ తీసుకోని పింఛనుదారులకు మూడు నెలల వరకు పెన్షన్ బకాయిలు చెల్లించబడతాయని తెల్పిపారు. ఈ బకాయిల చెల్లింపు నవంబర్, ఒకటినుండి నుండి అమలులోకి వస్తుందని, డిసెంబర్ ఒకటి నుండి విడుదల చేయబడుతుందని స్పష్టం చేసారు. ఎవరైనా పెన్షనర్ ఏదైనా కారణం చేత పెన్షన్ తీసుకోకపోతే, అది తాత్కాలిక వలసగా పరిగణించ బడుతుందన్నారు. పింఛనుదారులు 3 నెలలు నిరంతరంగా పెన్షన్ తీసుకోక పోతే, వారిని శాశ్వత వలసగా పరిగణించి వారి పెన్షన్ నిలిపివేయబడుతుందని స్పష్టం చేసారు. పంపిణీని ముగించిన తర్వాత వెంటనే చెల్లించని పింఛను మొత్తాన్ని ప్రభుత్వానికి జమ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కుటుంబ పోషణ కోసం ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద లబ్ది పొందుతున్న పెన్షనర్ మరణిస్తే జీవిత భాగస్వామికి పెన్షన్ (వితంతువు) వెంటనే మంజూరు చేసేలా ప్రభుత్వం మరో ఉత్తర్వు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- అరకులోయ : విరివిగా మొక్కలు నాటడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్య పడుతుందని అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్. పి.చలపతిరావు అన్నారు. నూతనంగా నిర్మించిన మహిళ డిగ్రీ కళాశాల ఆవరణలో సిపిడిసి కమిటీ ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అమ్మ పేరుతో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.కళాశాల ప్రిన్సిపాల్ పి.చలపతిరావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సుందర వనంగా తీర్చి దిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిడిసి సభ్యులు మయూరి రాజు, దండకారణ్య జూనియర్ కళాశాల యాజమాన్యం శ్రీను బాబు, స్పోర్ట్స్ పాఠశాల ప్రిన్సిపల్ మూర్తి, పీవీవీ నారాయణ, రామరాజు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు కే ధర్మారావు, బలరాం, లక్ష్మి, స్వర్ణలత, పి వి వి ప్రసాద్, దివ్య మౌనిక, అన్నపూర్ణ పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న ప్రిన్సిపల్

ప్రజా పోరాటాలను విస్తృతం చేయాలి

సిపిఎం మండల మహాసభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విఆర్.పురం

పోరాటాలతోనే కార్మిక కర్షక హక్కులు రక్షించబడతాయని, ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రజా పోరాటాలకు మరింత విస్తృతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పార్టీ నిర్దేశించిన ప్రణాళికతో పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని, అందుకు మహాసభ నాంది కావాలని పేర్కొన్నారు. మండలంలోని కిష్టారం గ్రామంలో సిపిఎం మండల 9వ మహాసభ ఆ పార్టీ నాయకులు పంకు సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. ముందుగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు వాళ్ల కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. దక్షిణభారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యతో పాటు ఈ మధ్య కాలంలో అమరులైన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, భద్రాచలం మాజీ ఎమ్మెల్యేలు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య, మాజీ ఎంపిపి కారం శిరమయ్య, పార్టీ నాయకులు పూనెం సత్యనారాయణ తదితరుల చిత్ర పటాలకు పూలతో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన మహాసభలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలపైనా, మతోన్మాదంపైనా, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైనా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్మించాల్సి ఉందని తెలిపారు. సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టి కోట్లాది రూపాయలు ప్రజలపై భారాలు వేస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కూటమి ప్రభుత్వంపై పార్టీ దశల వారీ కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

తీర్మానాలు

మండల అభివృద్ధికి పలు సమస్యలపై మహాసభ ఏకగ్రీవంగా తీర్మానాలు చేసింది. పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పునరావాసం పూర్తిస్థాయిలో ఇవ్వాలని, గ్రామాలను ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కూడా ప్యాకేజీ వర్తింపజేయాలని, ఉపాధి అవకాశాలు చూపాలని, అన్నవరం వంతెన నిర్మాణం చేపట్టాలని, పిఎమ్ పల్లి నుండి కందులూరు, కుందులూరు నుండి తులసిపాక వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని మహాసభ తీర్మానాలు చేసింది. మహాసభలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్, ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్లు వెట్టి లక్ష్మి, కారం బుచ్చమ్మ, నాగిరెడ్డి కారం సత్యం, శాఖ కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా పులి సంతోష్కుమార్

ఈ మహాసభలో 17 మందితో సిపిఎం మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పార్టీ మండల కార్యదర్శిగా పులి సంతోష్ కుమార్, మండల కమిటీ సభ్యులుగా సోయం చినబాబు, సున్నం రాజులు, పంకు సత్తిబాబు, పూనెం ప్రదీప్ కుమార్, జల్లి సత్యనారాయణ, పులి బుజ్జి, శీరపు తాతబాబురెడ్డి, వడ్లాది రమేష్, కారం సుందరయ్య, కారం సత్తిబాబు, తోడం రాజు, తుర్రం బాబూరావు, కథల కొండారెడ్డి, పొడియం శ్రీరామ్మూర్తి ఎన్నికయ్యారు.

ఘనంగా సత్య సాయిబాబా జయంతి వేడుకలు

ప్రజాశక్తి-దేవీపట్నం

మండలం ఇందుకూరుపేట సత్యసాయి పంప్ హౌస్ వద్ద సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బాబా చిత్రపటానికి పూలమాల వేసి పళ్ళు ఫలహారం పెట్టి, వాహనదారులకు, భక్తులకు, స్కూల్ పిల్లలకు పులిహోర పంచి పెట్టారు. ఈ సందర్భంగా సత్యసాయి పంపు హౌస్ యూనియన్ అధ్యక్షులు కట్టుమూరి వీరబాబు మాట్లాడుతూ శ్రీసత్యసాయి బాబా గిరిజన, మెట్ట ప్రాంతంలోని ప్రజలందరికీ సురక్షితమైన తాగునీటిని అందించి ప్రజలందరికీ ఆరోగ్య ప్రదాతగా నిలిచారని కొనియాడారు. ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారని, చాలామందికి ఉచిత వైద్యం, విద్యను అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొట్టు తాతాజీ, ఎస్ లక్ష్మీనారాయణ, ఒంగోలు అర్జునుడు, టి.కృష్ణమూర్తి, బి.అనిల్ కుమార్, సాయి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పులిహోరా పంపిణీ చేస్తున్న వీరబాబు తదితరులు

కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

26న మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26 న కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు అరకువేలి మండల కార్యదర్శి జె.భగత్రామ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం అరకులోయలో జిసిసి సోప్ యూనిట్ కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ మాట్లాడారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, గిరిజన రైతు సంఘాలు పిలుపుమేరకు 26వ తేదీన కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోను చేయాలన్నారు. జీవో 3 చట్టబద్ధత కల్పించాలని, కాఫీ రైతులు పండిస్తున్న పంటకి గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న స్కీం వర్కర్ లందరికీ కనీస 26 వేలు వేతనాలు ఇచ్చి,ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్మికులు, రైతులు, కాఫీ రైతులు కదలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు సింహాద్రి, సోప్ యూనిట్ నాయకులు పద్మ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ పాపినాయుడు

గంజాయి రహితంగా గ్రామాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గ్రామాల్లో గంజాయిని నిర్మూలించి గంజాయి రహిత గిరిజన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఎస్సై కే.పాపి నాయుడు పిలుపు నిచ్చారు. స్థానిక పోలీసు స్టేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. గంజాయితో జీవితాలు నాశనం అవుతున్నాయని చెప్పారు. అమాయక గిరిజనులను ఆశరాగా చేసుకుని ప్రైవేటు వ్యక్తులు గంజాయి సాగు, రవాణా చేస్తూ అస్తులు కూడబెడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగణంగా గంజాయి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సమన్వయం చేసుకుని సాగు, రవాణాతో కలిగే అనార్ధాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. యువత ఉన్నత చదువులకు తోడ్పాటునిచ్చి వారిని ప్రోత్సాహన్నివ్వాలని ఆయన కోరారు.

సౌకర్యాల కల్పనకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని మాకవరం గ్రామ పంచాయతీకి చివరి గ్రామమైన చతాం గ్రామ ఆదివాసి గిరిజన పివిటిజి నివాసులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఓటర్ ఐడి కార్డులు, రహదారి, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామానికి రెవెన్యూ గ్రామంగా తీర్చిదిద్దాలని సిపిఎం మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్ ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ నరసమ్మ కు శనివారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని బాబుసోల పంచాయతీకి చెందిన ఏడుకొండల బంధ అనే గ్రామంలో గతంలో నివాసం ఉంటూ ఆరు సంవత్సరాలుగా చతాం అనే గ్రామం ఏర్పాటు చేసుకొని అడవి పైన పివిటిజులు అంధకారంలో జీవిస్తున్నారని వివరించారు. రెవిన్యూ గ్రామం కాకపోవడంతో అనేక అవస్థలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పీఎం జాన్ మన్ పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయాలని కోరారు. వృద్ధాప్య , వితంతు పింఛన్లు

జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయండి

- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జనన దృవీకరణ పత్రాలను మిషన్ మోడ్‌లో జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. ఒక సంవత్సరం దాటిన పిల్లలకు జనన దృవీకరణ పత్రాల కోసం అందిన దరఖాస్తులు ఆధార్ కారణంగా గ్రామ సచివాలయాల్లో తిరస్కరిస్తున్న విషయం జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిన నేపధ్యంలో కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసారు. ఒక సంవత్సరం వయస్సు దాటిన పిల్లలకు జనన దృవీకరణ పత్రాలు, మరణించిన వ్యక్తులకు మరణ దృవీకరణ పత్రాల జారీకి సంబంధిత మండల అధికారులు వెంటనే ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ అయ్యేలా చూడాలన్నారు. లబ్ధిదారుల సమ్మతితో తహశీల్దార్లు, సబ్ కలెక్టర్లు వీటిని ఆమోదించాలని స్పష్టం చేసారు. సంబంధిత పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు మిషన్ మోడ్‌లో 10 రోజుల్లో సంబంధిత కసరత్తు పూర్తీ చేయాలని, అదే దరఖాస్తులను తహశీల్దార్లు మూడు రోజుల్లోగా సబ్ కలెక్టర్లకు సమర్పించాలని, సబ్ కలెక్టర్లు వాటిపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తులు వచ్చినప్పుడల్లా ఈ అనుమతులను 3 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ విధయంలో తేడాలుంటే తీవ్రంగా పరిగణించడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. 22 మండలాల ఫరిధిలో సర్వే ప్రకారం 16,047 లేట్ బర్త్ సర్టిఫికెట్లు అవసరమున్నట్లు గుర్తించడం జరిగిందని, మండలాల వారిగా జాబితా పంపించడం జరిగిందని వీటిపై ఎంపీడీవో, తహశీల్దార్ వెంటనే చర్యలు తీసుకుని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పర్యాటక ప్రదేశాలను ఆహ్లాదకరంగా ఉంచాలి

ప్రాజెక్టు అధికారి అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: ఐటీడీఏ పరిధిలో పర్యాటకులను విపరీతంగా ఆకర్షిస్తున్న సుందర ప్రదేశాలను, జలపాతాలను పరిశుభ్రంగా సమర్ధవంతంగా నిర్వహించడానికి, స్థానిక సంస్థల ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రోజెక్ట్ అధికారి వి.అభిషేక్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్ తదితరులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతగిరి, అరకు, డుంబ్రిగూడ, పాడేరు, చింతపల్లి మండలాల పరిధిలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలలో పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ సౌకర్యం తదితర అంశాలపై ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చారు. టూరిజం సీజన్ ముగిసే వరకు అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించు కోవాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, వారంతాలలో రద్దీ దృష్ట్యా పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని షిఫ్ట్ విధానంలో ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటక ప్రదేశాలలో డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని యం.పి.డి.ఓ లను, పంచాయతీరాజ్ విస్తరణాధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రదేశాలలో దశల వారీగా ప్లాస్టిక్ నియంత్రణ అమలు చేయడానికి వందన వికాస్ కేంద్రాల ద్వారా రూపొందిస్తున్న ప్రత్యామ్నాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పర్యాటకులకు సూచించారు. చిలకలగెడ్డ, వంట్లమామిడి, డౌనూరు తదితర ప్రదేశాలలో వందన వికాస కేంద్రాల ఉత్పత్తులతో స్టాల్స్ నిర్వహించాలని డి.ఆర్.డి.ఎ ప్రాజెక్టు అధికారిని ఆదేశించారు. పర్యాటక ప్రదేశాలను ఆహ్లాదకరంగా ఉంచడానికి, పర్యావరణాన్ని కాపాడటానికి పర్యాటకులు కూడా సహకరించాలని ఆయన సూచించారు. ప్రాజెక్టు అధికారి ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన అన్ని పర్యాటక ప్రదేశాలలో డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసారు. పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

మహాసభ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: డిసెంబర్ 4,5 తేదీలో పాడేరులో జరిగే అల్లూరి సీతారామరాజు జిల్లా సిపిఎం మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కె.రామారావు పిలుపునిచ్చారు. శనివారం అరకులోయ మండల కేంద్రంలోని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా మహాసభ గోడ పత్రిక విడుదల చేశారు.ఈ సంధర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు మాట్లాడుతూ,జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని, 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని, కాఫీ రైతులు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పివిటిజిలకు సీఎం జన్మన్ ఇల్లుల నగదు రూ.5 లక్షలు వరకు పెంచాలని, పీవీటీజిలకు అంత్యోదయ కార్డు అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.గిరిజన స్పెషల్ డీఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం డిమాండ్ చేశారు.ఈ జిల్లా మహాసభను విజయవంతానికి ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మికులు,ఆదివాసి గిరిజనులు ఆర్థిక సాయం అందించి విజయవంతానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జన్ని భగత్రం, గత్తుం బుజ్జిబాబు, పి బాలదేవ్, కె.మగన్న, అప్పలస్వామి పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: టిడిపి సభ్యత్వంతోనే కార్యకర్తలకు భరోసా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి సుబ్బారావు అన్నారు. మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రంలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆ పార్టీ నాయకులతో శనివారం నిర్వహించారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి టీడీపీ కట్టుబడి పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అరకు అసెంబ్లీ సభ్యత్వ నమోదు సమన్వయకర్త రాజ్ కుమార్, కితలంగి బూత్ ఇన్చార్జిలు చంటి, బాలక్రిష్ణ, నర్సయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాలు నమోదు చేస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

దగ్ధమవుతున్న వరి కుప్పలు

వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పాతకోట పంచాయతీ పి.బొడ్డపుట్టు గ్రామంలో కొర్రా పండన్న, పి.వెంకటరావు రైతుల వరి కుప్పలు శనివారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. చిన్నపాటి మంటలు చెలరేగి వరి కుప్పలు అగ్నికి ఆహుతి అయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో దగ్ధ మయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరమంతా కష్టపడి చేతి కొచ్చిన పంట కళ్ళు ఎదురుగా కాలి పోతుండడంతో బాధితులు రోధించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలోని సీతగుంట గిరిజన ఆశ్రమ బాలుర 1 వసతి గృహం విద్యార్థులు ప్రధాన ఉపాధ్యాయులు టి నాగేశ్వర్ రావు డిప్యుటీ వార్డెన్ టి చక్రదర్ ఏర్పాటు చేసిన వానమహోత్సవం లో ఆదివాసీ గిరిజనుల జానపద నత్యాలు, విద్యార్థుల గిరిజన వేసాధారణ నాటికలు చూపారులకు ఆకట్టుకొన్నాయి ఈకార్యక్రమంలో వానమోహోత్సవం సందర్భంగా స్థానిక ఎ టి డబుల్యూ ఓ కూడా వెంకటరమణ ఇతరా ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి చింతపల్లి :- మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సిమెంటు రహదారిని సద్వినియోగం చేసుకోవాలని అంజలి శనివారం పంచాయతీ సర్పంచ్ పేట్ల రాజబాబు కోరారు. ఆ పంచాయితీ కి చెందిన జంగం చెట్టు గ్రామంలో ఉపాధి హామీ పథకం నిదులతో నిర్మిస్తున్న సిమెంట్ రహదారి పనులను ఉపాధి హామీ ఉద్యోగులు, గ్రామస్తులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రహదారి నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు గ్రామస్తులు న హకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డ్ సభ్యులు వి.మచ్చ కొండ, కే.గిరి, మాజీ ఎంపీటీసీ పోతురాజు, ఎన్.నూకరాజు, ఉంద్ర మల్లేశ్వరరావు, కామేష్ పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

సంక్షేమ పథకాలు అందరికీ అందినప్పడే అభివృద్ధి

ప్రజాశక్తి - అనకాపల్లి : సంక్షేమ పథకాలు అందరికీ అందినప్పుడే అభివృద్ధి జరిగినట్టు లెక్క అని శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేసి రాష్టానికే అనకాపల్లి జిల్లా ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం 58 సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటి వివరాలు ప్రజలకు తెలిసేలా, వినియోగించుకొనేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలన్నారు. అనకాపల్లి కలెక్టరేట్‌లో అనకాపల్లి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమీక్షా సమావేశం శనివారం అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సిఎం.రమేష్ అధ్యక్షతన జరిగింది. అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా, శాసనసభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర, మండల పరిషత్ అధ్యక్షులు హాజరై కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. డ్వామా, గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణ, ఆరోగ్య, నైపుణ్యాభివృద్ధి, లీడ్ బ్యాంకు, విద్య, జాతీయ రహదారులు తదితర శాఖలపై సమీక్ష సాగింది. ఈ సందర్భంగా అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాల వివరాలు తెలియక, ఎలా ధరఖాస్తు చేసుకోవాలో తెలియక ప్రజలు లబ్ది పొందలేక పోతున్నారన్నారు. పథకాలను ప్రచారం చేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. అధికారులు తమ శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో ప్రచారం కల్పించాలని తెలిపారు. చాలా పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోమంటున్నారని, ప్రజలకు అవగాహన ఉండటం లేదని, ఈ నేపథ్యంలో ప్రతి మండలానికీ పథకాల అమలుకు ఒక అధికారిని నియమించాలని తెలిపారు. మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి పథకాన్నీ లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. పార్లమెంటు సభ్యులు సిఎం.రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 38 శాఖల ద్వారా 58 సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. సమావేశంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్ బాబు, జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైభవ్ 'విశేష ప్రెట్' ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైభవ్ జ్యూయలర్స్ ఆధ్వర్యాన రెండు రోజులపాటు విశాఖలోని వెల్కమ్ హోటల్ డివి గ్రాండ్ బేలో తలపెట్టిన 'విశేష ప్రెట్' ప్రదర్శన, అమ్మకాన్ని సంస్థ సిఎండి మల్లికా రత్నకుమారి గ్రంధి, డైరెక్టర్ కీర్తన గ్రంధి, ఎ.అలేఖ్య, కె.స్నేహా శనివారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 5 లక్షలలోపు ఇన్స్పైర్డ్, హ్యాండ్ క్రాఫ్ట్, క్యూరేటెడ్ డిజైనర్ డైమండ్ ఆభరణాలు, పేస్టెల్ ఆక్వా కలెక్షన్, విక్టోరియన్, గోల్డ్, ఏంటిక్, ఫ్యూజన్, సిజెడ్ డైమండ్ ఆభరణాల క్యూరేటెడ్ కలెక్షన్‌లు మునుపెన్నడూ చూడని శ్రేణిని అందుబాటులో ఉంచారు. ఈ ప్రదర్శన ఆదివారం కూడా కొనసాగుతుందని, వినియోగదారులు ఈ ప్రదర్శనను వీక్షించి, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వైభవ్ సంస్థ చైర్‌పర్సన్ గ్రంధి మల్లికా మనోజ్ కోరారు.

కాంగ్రెస్ విజయోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జార్ఖండ్ రాష్ట్రంలో ఇండియా కూటమి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తపరుస్తూ శనివారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పార్టీ పశ్చిమ నియోజక వర్గ ఇన్‌ఛార్జి కెవి.సూర్యనారాయణ, విశాఖ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సతీష్, గౌతమ్ కుమార్ పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి-పాడేరుటౌన్: గ్రామ, వార్డు వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పది వేల రూపాయల వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందరరావు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద గ్రామ వార్డు వాలంటీర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాలంటీర్లకు సంబంధించి పెండింగ్ వేతనాలు, విడుదల చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బలవంతంగా రాజీనామా చేసిన వాలంటీర్లు అందరిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వాలంటీర్ల విషయంలో మంత్రి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2023 ఆగస్టు తర్వాత వాలంటీర్లను రెన్యువల్ చేయకుండా 2024 మే వరకు వేతనాలు ఎలా చెల్లించారని ప్రశ్నించారు. ఎన్నికల విధుల నుండి వాలంటీర్లను తప్పించాలని హైకోర్టుకు ఎందుకు వెళ్లారని నిలదీశారు. ప్రజలు ఎన్నో ఆశలతో కూటమి నేతలకు ఓట్లు వేసి గెలిపించారన్న విషయాన్ని ప్రభుత్వం మర్చిపోకూడదన్నారు. అవసరమైతే వాలంటీర్లందరిని సమీకరించి కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షులు ధర్మాన పడాల్, సిఐటియు నాయకులు సన్నిబాబు, వాలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, కొండబాబు, ఆదివాసీ శోభన్, చిన్నయ్య, సురేష్ కుమార్, సత్యారావు, తాతబాబు, కష్ణారావు, ఆనంద్, కొండమ్మ, భవాని, పాల్గొన్నారు.

పాడేరులో ధర్నా చేస్తున్న వాలంటీర్లు

అసెంబ్లీ సాక్షిగా అబద్దాలు

రంపచోడవరం : రాష్ట్రంలో వాలంటీర్ వ్యవస్థపై అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర మంత్రులు అబద్దాలు ఆడుతున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు, వాలంటీర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చవలం సుబ్రహ్మణ్యం అన్నారు. మంత్రి బాల వీరాంజనేయస్వామి వాలంటీర్ల విషయంలో ప్రజలకు అసత్యాలు చెబుతుంటే చంద్రబాబు మౌనంగా ఉండడాన్ని నిరసిస్తూ సిఐటియు, ఏపీ గ్రామ వార్డు వాలంటీర్ల సంఘం ఆధ్వర్యాన శనివారం రంపచోడవరం ఐటిడిఏ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 ఆగస్టు తర్వాత వాలంటీర్లను రెన్యువల్ చేయకుండా 2024 మే వరకు వేతనాలు ఎలా చెల్లించారని, ఎన్నికల విధుల నుండి వాలంటీర్లను తప్పించాలని హైకోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో ప్రజలకు అసత్యాలు చెప్పడానికి మానుకోవాలని, మంత్రి బాల వీరంజనేయ స్వామి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లందరిని కొనసాగించి, రూ.10వేలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వాలంటీర్లను సమీకరించి ఐటీడీఏలు, కలెక్టరేట్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రంపచోడవరం మండల కార్యదర్శి కె.వెంకన్న, నాయకులు కె.భాను, ఎస్ కళావతి, వాలంటీర్లు పాల్గొన్నారు.

రంపచోడవరంలో పిఒకు వినతిపత్రం అందజేస్తున్న వాలంటీర్లు

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ ఓల్డ్ సిటీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పాత లక్ష్మీ టాకీస్ సమీపంలోగల శెట్టిబలిజ సామాజిక భవనంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వన్ టౌన్ సిఐ జి.దేముడు బాబు ముఖ్య అతిథిగా హాజరై ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజాగ్ ఓల్డ్ సిటీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జర్నలిస్టులు సామాజిక సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనడం హర్షణీయమన్నారు. శ్రీ కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం మాట్లాడుతూ అందరికి ఉపయోగపడే కార్యక్రమాన్ని జర్నలిస్టులు ప్రారంభించడం సంతోషించదగ్గ విషయమన్నారు. వైజాగ్ ఓల్డ్ సిటీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కీర్తన్, అర్జున్‌లు మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు ఎన్‌పిసిఐ లింక్ తప్పనిసరి

ప్రజాశక్తి-కొయ్యూరు : ప్రభుత్వ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఎన్‌పిసిఐ లింక్ చేయించుకోవాలని కొయ్యూరు సబ్ పోస్టు మాస్టర్ బి.వీరభద్రరావు అన్నారు. ఎన్‌పిసిఐ లింక్ కోసం తమ పరిధిలోని ఖాతాదారులు కొయ్యూరు పోస్టు ఆఫీసును సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఎన్‌పిసిఐ మ్యాపర్‌లో ఆధార్‌ను, బ్యాంకు అకౌంట్‌కు లింక్ చేయించుకోవాలని సూచించారు. ఐపిబిపి ఎకౌంట్ ఓపెన్ చేయించుకోవడానికి ఆధార్ కార్డు, సెల్ ఫోన్ తీసుకురావాలని కోరారు.

హైదరాబాద్ నిఫ్ట్ కేంద్రంలో అడ్మిషన్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)లో 2025 జులై నుండి విద్యా సంవత్సరానికి అడ్మిషన్లను ప్రారంభించినట్లు ఇనిస్టిట్యూట్ క్యాంపస్ అకడమిక్ కో - ఆర్డినేటర్ డాక్టర్ ఎం.అన్నాజీ శర్మ తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిఫ్ట్ దేశవ్యాప్తంగా 19 వృత్తిపరమైన కేంద్రాలను కలిగి ఉందన్నారు. అద్భుతమైన ప్లేస్మెంట్ అవకాశాలతో కోర్సులు ఉన్నాయన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పద్మశాలి సంఘం సభ్యులు

పద్మశాలి సంఘం ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -సీలేరు : పద్మశాలి సంఘం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జీకే వీధి మండలం సీలేరు మెయిన్ డ్యామ్ సమీపంలో ఉన్న జామి తోటలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వనభోజనాలు ఏర్పాటు చేశారు. పద్మశాలి కుటుంబాలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన సేనాపతిగా వానపల్లి అప్పారావు, ఉపసేనాపతిగా చింతలపూడి అప్పారావు, గౌరవ అధ్యక్షులుగా ఏపీజెన్కో అకౌంట్ ఆఫీసర్ ఇవివి.సత్యనారాయణ, సీలేరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకర్రావు, కాంట్రాక్టర్ నీలం రమణ, అధ్యక్షులుగా చుక్కల. సూరిబాబు, కార్యదర్శిగా శీరం ధారబాబు, కోశాధికారిగా ఎస్.పాపారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ వారు మాట్లాడుతూ ఏడాదికి ప్రతి ఒక్క సంఘ సభ్యుల నుండి రూ.500 వసూలు చేసి మూలధనం సమకూర్చి, ఆ సొమ్ము సంఘం బలోపేతం చేయడానికి వినియోగించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు నీలం అప్పారావు, సిహెచ్ఎం.శ్రీను, వానపల్లి అప్పారావు, శీరం గోవిందు, పందిరి ధారబాబు, రామకృష్ణ, సప్ప సత్తిబాబు, కృష్ణ, రవి, పడిమి శివ, పడిమి వెంకటరావు, పసగడుగులు బాబురావు, లక్ష్మణరావు, కొల్లు రవి, మణిరాజు, లోవ తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ తీరంలో శుభ్రతా చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖ నగర పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలలో భాగంగా జివిఎంసి బీచ్ పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు ప్రజలను, పలు సంస్థలను భాగస్వామ్యం చేస్తోందని జివిఎంసి అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ, జివిఎంసి సంయుక్తంగా రుషికొండ బీచ్‌లో శనివారం పరిశుభ్రతా చర్యలు చేపట్టాయని వెల్లడించారు. తీరంలో సేకరించిన వ్యర్థాలను జివిఎంసి శానిటరీ ఇన్‌స్పెక్టరు రవికి అప్పగించినట్టు ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎమ్.విజయలక్ష్మి తెలిపారు.

వాల్‌చంద్ హీరాచంద్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న అధికారులు

హెచ్‌ఎస్‌ఎల్‌లో వాల్‌చంద్ హీరా చంద్ జయంతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు వాల్‌చంద్ హీరాచంద్ 142వ జయంతిని శనివారం ఉదయం విశాఖపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ సిఎండి హేమంత్ ఖత్రి మాట్లాడుతూ సముద్ర పరిశ్రమలో నిజమైన మార్గదర్శకునిగా, భారత పారిశ్రామిక వృద్ధికి వాల్‌చంద్ హీరాచంద్ విశేష కృషి చేశారని కొనియాడారు.